

రాష్ట్రస్థాయికి 21ప్రాజెక్టులు

అన్నమయ్య జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో జరిగే ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల ప్రదర్శనకు 21 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. మొత్తం 245 ప్రాజెక్టులు ప్రదర్శకు ఉంచారు. -8లో




అంతుచిక్కని వ్యాధితో ఆవులు మృతి

నిమ్మనపల్లె మండలంలో అంతు చిక్కని వ్యాధితో నాలుగు చూడి ఆవులు, రెండు పెయ్యదూడలు మృతి చెందాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 95 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

సింహంపై నరసింహుడు



సింహవాహనంపై నుంచి భక్తులను కటాక్షిస్తున్న స్వామి వారు

కడప కల్చరల్: కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. అరాచకాలు సృష్టిస్తున్న దుష్టులను అంతం చేసి శిష్ట రక్షణ చేసేందుకు దేవదేవుడు నరసింహుడై గర్జించాడు. శత్రువులను తునియలు చేసేందుకు విక్రమించాడు. ఆయుధ ధారియై పరాక్రమంతో వెళుతున్న ఆ పురుషోత్తముడిని చూసి భక్తులు తన్మయులయ్యారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం చిన్న శేష వాహనంపై మాడవీధుల్లో విహరించారు. వాహన సేవ అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజన సేవ చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో కనుల పండువగా ఏర్పాటు చేసిన ఊయలపై సేద తీర్చారు. మంగళ వాయిద్యాలు, గాయకుల కమ్మని సంగీతం వింటూ స్వామి వింజామర సేవల మధ్య విశ్రమించారు. అనంతరం సింహంపై కడప రాయుడు నరసింహునిగా కొలువుదీరి భక్తులను కరుణించాడు. మహిళా భక్తబృందాలు పురుష బృందాలతో పోటీపడుతూ కోలాటాలు, భజనలు నిర్వహించారు. ప్రత్యేక వాయిద్య బృందాలు స్వామిని కీర్తిస్తూ సంగీతార్చన చేస్తూ ఊరేగింపుగా సాగారు.

ఒత్తిడికి లోనుకావద్దు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జిల్లా ఉప విద్యాధికారి శ్రీరాం పురుషోత్తం

రాయచోటి టౌన్: పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి లోను కావద్దని, ప్రణాళికా ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చని జిల్లా ఉప విద్యాశాఖాధికారి శ్రీ రాం పురుషోత్తం సూచించారు. సోమవారం రాయచోటి డైట్ కేంద్రంలోని సభాభవనంలో పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయని చెప్పారు. విద్యార్థులకుపరీక్షలు అంటే భయం లేకుండా అవగాహన కల్పించాలని చెప్పారు. ఒత్తిడిని జయిస్తే మంచి మార్కులు సాధించవచ్చున్నారు. అందుకు విద్యార్థులు ధ్యానం, వ్యాయామం, యోగా, నడక వంటివి చేయాలని సూచించారు. ఒత్తిడిని జయించడానికి 32 సూత్రాలను విశదీకరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో సదరన్ స్టేట్స్ రీజనల్ కన్వీనర్ చిట్టిబాబు, జనార్ధన్, జెసిడీఓ రాధ, సీఎంఓ కరుణాకర్, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, ఏఎంవో రామకృష్ణ, పీఈటీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, పీడీలు రెడ్డెయ్య, లక్ష్మినారాయణ, మదన్‌మోహన్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, వరదరాజు, చక్రపాణి, అంజి, లక్ష్మిదేవి, శ్రీనివాసులు, వాణి తదితరులు పాల్గొన్నారు.

హక్కు లొచ్చాయ్..



- 20 ఏళ్ల క్రితం జారీచేసిన డీకేటీ పట్టా భూములపై నిషేధం తొలగింపు
- జిల్లాలో 56,764 మంది రైతులకు ప్రయోజనం
- ప్రభుత్వం నుంచి ధృవీకరణలు జారీ

లబ్ధి కలిగే అసైన్‌మెంట్ భూమి వివరాలు

సబ్ డివిజన్	సర్వే నంబర్ల సంఖ్య	భూ విస్తీర్ణం	రైతులు
మదనపల్లె	37,762	24,886	46,946
రాజంపేట	12,414	8,679	24,237
రాయచోటి	37,303	23,199	53,675

బి.కొత్తకోట: 20 ఏళ్ల క్రితం ప్రభుత్వాలు పేదలకు మంజూరు చేసిన వ్యవసాయ డీకేటీ భూములను విక్రయించుకోవచ్చన్న ప్రభుత్వ ఉత్తర్వులతో ఇప్పటిదాకా నిబంధనాల్లో ఉన్న భూములకు విముక్తి కలిగింది. ప్రభుత్వాలు ఏర్పడిన నాటి నుంచి పేదలకు వ్యవసాయం కోసం భూములను పట్టాలుగా అందిస్తూ వస్తున్నాయి. అయితే వీటి క్రయ విక్రయాలను నిషేధించారు. ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు 22–ఏ జాబితాలో చేర్చి వాటిపై నిషేధం విధిస్తూ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నివేదికలను సమర్పిస్తుంటారు. దీని ఆధారంగా సంబంధిత సర్వే నంబర్లకు చెందిన భూములకు రిజిస్ట్రేషన్లు చేయరు. ఇలా 20 ఏళ్ల కిందట ఇచ్చిన వ్యవసాయ భూముల పట్టాలపై నిషేధం తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించి చర్యలు తీసుకోవడంతో పేద రైతుల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 20 ఏళ్ల క్రితం పొందిన డీకేటీ భూములపై ప్రభుత్వం నిషేధాన్ని సడలించి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయడమే కాక ధృవీకరణలను కూడా జారీ చేసింది. ఈ భూములు ఇప్పుడు రూ. లక్షల్లో పలుకుతున్నాయి. కోట్లు పలుకుతున్న భూములు కూడా ఉన్నాయి.

- ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అన్నమయ్య జిల్లాలో నిషేధిత భూముల జాబితా నుంచి 1,24,858 ఎకరాల భూమికి విముక్తి కలిగించారు.

మదనపల్లె, రాజంపేట, రాయచోటి రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 30 మండలాల తహసీల్దార్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధిత జాబితా నుంచి తొలగించాల్సిన భూముల వివరాల నివేదికను సిద్ధం చేశారు. వీటిని ఆర్డీఓలు పరిశీలించగా కలెక్టర్ ఆమోదం తెలిపారు. దీంతో ఎప్పటినుంచో నిషేధిత జాబితాలో ఉన్న డీకేటీ భూములకు నిషేధం నుంచి సడలింపు లభించింది. ఈ జాబితాలోని రైతులకు సంబంధిత సర్వే నంబర్లలోని డీకేటీ భూములను క్రయవిక్రయాలు జరుపుకునే పూర్తి స్వేచ్ఛను లబ్ధిదారులకు కల్పిస్తూ ప్రభుత్వం ధృవీకరణ పత్రాలను జారీ చేసింది. వీటిపై తహసీల్దార్లు సంతకాలు చేసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సర్వే నంబర్లు విస్తీర్ణం వివరాలను సంబంధిత సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపి 22–ఏ జాబితా నుంచి తొలగించారు. దీనివల్ల జిల్లాలో 56,764 మంది రైతులకు ప్రయోజనం కలిగింది.

వేల కోట్ల విలువ



ప్రభుత్వం డీకేటీ భూములకు నిషేధం నుంచి తొలగించడంతో జిల్లాలో ఈ భూముల విలువ వేల కోట్లకు చేరింది. మదనపల్లె, రాయచోటి, రాజంపేట పట్టణాల పరిధిలోని ఈ భూములను మొన్నటిదాకా కొనుగోలు చేసేందుకు నిషేధిత భూమి అన్న నిబంధన అడ్డంకి ఉండేది. దీనివల్ల వీటిని తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ వచ్చారు. ఇప్పుడు విక్రయాలు జరుపుకునే వెసులుబాటు లభించడంతో విలువ కోట్లకు చేరింది. మండల కేంద్రాలు, వాటికి సమీపంలోని భూముల విలువ గతంలో ఎకరానికి లక్షో, రెండు లక్షలో పలికితే చాలన్న భావన ఉండేది. ఇప్పుడు ఎకరా భూమి కనీసం రూ.5నుంచి రూ.7 కోట్లు పలుకుతోంది. మండల సరిహద్దు ప్రాంతమైతే రూ.3–రూ.4 కోట్లు పలుకుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంత తక్కువన్నా ఎకరం రూ.10 నుంచి రూ.15 లక్షలకుపైమాటే. మున్సిపాటిలో పరిధిలో లేదా సరిహద్దులోని భూముల విలువ రూ.10–రూ.20 కోట్ల మధ్య పలుకుతోంది. దీనితో ప్రభుత్వం తొలగించిన నిషేధిత భూముల విలువ వేల కోట్లు పలుకుతోంది. ఈ భూములన్నీ ఇప్పటికే రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయి. రైతులు విక్రయించుకోంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

విలువ పెరిగింది



తంబళ్లపల్లెకు సమీపంలో ప్రభుత్వ డీకే టీ భూమి 1.23 ఎకరాలు ఇచ్చారు. దీని విలువ ఎకరాకు రూ.లక్షలోపే. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నా పేరిట ఉన్న డీకేటీ భూమికి నిషేధం తొలగించి ధృవీకరణ పత్రం జారీ చేశారు. రెవెన్యూ అధికారులు ఈ పత్రం ఇచ్చారు. ఇప్పుడు ఈ భూమి విలువ బాగా పెరిగింది. ఎకరా లక్షలకు చేరింది. ముఖ్యమంత్రి చేసిన సహాయం మరవలేం. కుటుంబ అవసరాలకు ఈ భూమి ఉపయోగపడుతుంది. -కే.విజయనిర్మల, మహిళా రైతు, తంబళ్లపల్లె

జీవితాలను మార్చేస్తుంది



సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పేద రైతుల జీవితాలను మార్చేస్తుంది. నాకు ప్రభుత్వ డీకేటీ భూమి 3.88 ఎకరాలు ఉంది. ఈ భూమి గతంలో విలువ ఉండేదికాదు. ఇప్పుడు ఎకరం రూ.10 లక్షలు పలుకుతోంది. ఇంతటి సహాయం ఏ ప్రభుత్వం చేయలేదు. డీకేటీ భూములున్న రైతులు కుటుంబ అవసరాలకు విక్రయించుకోలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడా కష్టం తీరింది. సీఎం చేసిన సహాయానికి రుణపడి ఉంటాం. -రాజారెడ్డి, పాపేపల్లె, పెద్దమండ్యం మండలం

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్




ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, ఎస్డీసీ శ్రీలేఖలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ స్థాయిలో, మండలాల్లో కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని, అధికారుల ఆదేశించారు. అనంతరం ప్రజల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

స్పందనలో విజ్ఞప్తులు: రామాపురం మండలం, సూర్యనారాయణపురం గ్రామానికి చెందిన జి లక్ష్మీదేవి గ్రామంలో 702/2 సర్వే నంబరులో తమకు పొలం ఉందని, కానీ ఆన్‌లైన్‌లో సర్వే నంబరు 707/2గా పొరపాటుగా నమోదైందని, దానిని సరిచేయాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. పీలేరు మండలం, వేపులబైలు గ్రామానికి చెందిన కె శకుంతలమ్మ జగన్న సంపూర్ణ గృహ హక్కు పథకంలో భాగంగా తనకు మంజూరైన ఇంటికి 2022 ఫిబ్రవరి, జూలై మాసాలలో రూ. 10 వేలు చెల్లించానని, కానీ రుణ విముక్తికి ఇప్పటి వరకు నాకు ఓటీపీ జనరేట్ కాలేదన్నారు. విచారణ చేసి నా సమస్యను పరిష్కరించి ఇంటి పట్టా ఇవ్వాలని విన్నవించారు. వీరబల్లి మండలం, వంగిమళ్ల గ్రామం కస్పాలో పి బాబాజాన్ తనకు 48 సెంట్ల భూమి ఉందని, పురాతన కాలం నుంచి ఈ భూమికి నడకదారి ఉండగా కొంతమంది దానిని మూసివేసి మా భూమిలో నుండి వెళ్తున్నారన్నారు. విచారణ చేసి నడకదారి ఏర్పాటు చేయాలని విన్నవిస్తూ జిల్లా కలెక్టర్ అర్జీ సమర్పించారు.

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి రూ.100 కోట్ల నిధులు

జీఓ విడుదలపై ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హర్షం



ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి



ఇంట్రిగేటెడ్ కలెక్టరేట్ భవన సముదాయం

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని, రాయచోటి పట్టణ రూపురేఖలు మారిపోతున్నాయని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో నూతన కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం వంద కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ జీఓ విడుదల చేయడంపై సోమవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలో కేటాయించిన 40 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం కోసం ప్రభుత్వం వంద కోట్ల రూపాయల నిధుల మంజూరుకు ఈ నెల 8న ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఈ భవన నిర్మాణాలు 50 ఏళ్లకు తగ్గట్లుగా ఉండేలా డిజైన్లు చేయించినట్లు చెప్పారు. అన్ని కార్యాలయాలు ప్రజలకు అనుకూలంగా కలెక్టరేట్ భవన సముదాయంలోనే ఉంటాయన్నారు. అలాగే నూతన కలెక్టర్ కార్యాలయం పక్కనే ఉన్న 25 ఎకరాల్లో ఎస్పీ బంగ్లా, పోలీసు పరేడ్ గ్రౌండ్ నిర్మాణాలకు కూడా ప్రత్యేకంగా నిధులు మంజూరు అవుతాయన్నారు. ఈ కార్యాలయాల సమీపంలోనే 15 ఎకరాలలో జిల్లా కోర్టు భవనాలకు స్థల కేటాయింపు జరిగిందన్నారు. విద్యా వ్యవస్థ పటిష్టంలో భాగంగా రూ.190 కోట్ల నిధులతో పీజీ కేంద్రం నిర్మాణానికి కూడా ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తాయన్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న 5 ఎకరాలలో కలెక్టర్ బంగ్లా నిర్మాణపు పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే ఇండిపెండెన్స్‌డే లోగా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు. జరుగుతున్న మంచిని, అభివృద్ధిని చూసి కొంత మంది ఓర్వలేక బాధతో దుష్ప్రచారాలు, అవాస్తవాలతో చెలరేగుతున్నారన్నారు. అటువంటి వారి మాటలను ఏ ఒక్క శాతం కూడా తాను పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణాలకు వంద కోట్ల రూపాయల నిధుల మంజూరుకు జీఓ విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌కు, సహకరించిన ఎంపీ మిథున్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి ధనంజయరెడ్డిలకు శ్రీకాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చెరువు మెరిసె.. ప్రజలు మురిసె

- చింతమాకులపల్లె చెరువుకు జాతీయ స్థాయిలో పేరు
- అమృత్ సరోవర్ కింద బెస్ట్‌గా గుర్తింపు



చెరువులో చేరిన వర్షపు నీరు

కురబలకోట: అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని చింతమాకులపల్లె సచివాలయ పరిధిలోని నార్లపల్లె దగ్గరున్న చాకిరేవు చెరువుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఏడాది క్రితం ఈచెరువులో అమృత్ సరోవర్ కింద ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నీటి నిల్వ సంరక్షణ అభివృద్ధి పనులు రూ. 6లక్షలతో చేపట్టారు. అదిప్పుడు సత్ఫలితాలు ఇవ్వడంతో జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇందులో భాగంగా సోమవారం న్యూఢిల్లీలో జరిగిన సెమినార్‌లో స్థానిక ఎంపీడీఓ దిలీప్‌కుమార్ చెరువు సత్ఫలితాల గురించి ప్రజంటేషన్ ఇచ్చారు. ఉపాధి హామీ కమిషనర్ చిన్నతాతయ్య కూడా ఈ సందర్భంగా జరిగిన సెమినార్‌లో పాల్గొన్నారు. ఏడాది కిందట ఈచెరువును అమృత సరోవర్ పథకం కింద చేపట్టడం జరిగిందని ఎంపీడీఓ ప్రజంటేషన్‌లో వివరించినట్లు తెలిపారు. అప్పట్లో ముళ్లపొదలతో నిండి పెద్దగా నీరు చేరని పరిస్థితి ఉండేది. వీటన్నింటిని తొలగించారు. పూడిక తీశారు. ట్రెంచీలు కొట్టారు. బౌండరీల నిర్మాణం, చెరువు సరిహద్దు మేర మొక్కల పెంపకం, వర్షపు నీరు చెరువుకు చేరేలా చర్యలు చేపట్టారు. దీంతో ఎప్పుడూ వర్షాలకు పెద్దగా నిండని ఈచెరువు ఇటీవల కురిసిన వర్షాలకు ఆశాజనకంగా నీళ్లు చేరాయి. పశుపక్ష్యాదులతో పాటు మూగ జీవాలకు తాగునీటి కొరత తీరింది. ఆయకట్టుకు సాగునీరు లభ్యమైంది. పరీవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. కూలీలకు ఉపాధిగా పని లభించింది. చెరువు రూపురేఖలు మారడంతో పాటు చెరువును ఆధునికీకరించారు. పాత చెరువు కొత్తగా మారడంతో రైతులతో పాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని సెమినార్‌లో ప్రజంటేషన్ ఇచ్చినట్లు ఎంపీడీఓ దిలీప్‌కుమార్ వివరించారు. రాష్ట్రం నుంచి ఏకైక బెస్ట్ చెరువుగా జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటు ఆపై కురబలకోట మండలానికి సంబందించిన చెరువు కావవడం గర్వంగా ఉందని తెలిపారు.

ఎంతో సంతోషంగా ఉంది



అమృత సరోవర్ పథకం కింద చింతమాకుపల్లె చెరువు అభివృద్ధి చెందడం ఆపై రాష్ట్రం నుండి బెస్ట్ చెరువుగా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణం. నీటి సంరక్షణ చర్యలకు ఈ చెరువు స్ఫూర్తిదాయకంగా.. మోడల్‌గా నిలవడం సంతోషకరం. పాత చెరువు పునరుద్ధరించడంతో ఆప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. -బి. దస్తగిరి, ఎంపీపీ, కురబలకోట మండలం

క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

రాయచోటి : స్పందన ద్వారా అందజేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పోలీస్ యంత్రాంగానికి అదనపు ఎస్పీ వీబీ రాజ్ కమల్ ఆదేశించారు. సోమవారం రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలని ఈ సందర్భంగా కింది స్థాయి అధికారులకు సూచించారు. జిల్లా నలుమూలల నుంచి పలు సమస్యలపై స్పందనకు 51 ఫిర్యాదులను అందజేసి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు కోరారు. అదనపు ఎస్పీ ప్రజల సమస్యలను స్వయంగా విని ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి వీడియో కాన్ఫరెన్సు, టెలి కాన్ఫరెన్సులో వారి సమస్యలపై అధికారులతో చర్చించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు.

యువకుడి అదృశ్యం


రామ్మోహన్‌రెడ్డి (ఫైల్)

బ్రహ్మంగారిమఠం : మండలంలోని డి.నేలటూరు పంచాయతీ మలుగుడుపాడు గ్రామానికి చెందిన కుంచాల రామ్మోహన్‌రెడ్డి(28) అనే యువకుడు శుక్రవారం నుంచి కనిపించక పోవడంతో అతని తండ్రి పిచ్చిరెడ్డి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. పిచ్చిరెడ్డి, ఎస్ఐ విద్యాసాగర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మలుగుడుపాడు గ్రామానికి చెందిన పిచ్చిరెడ్డి, రామలక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. రామ్మోహన్‌రెడ్డి చిన్న కుమారుడు. డిగ్రీ వరకు చదివి హైదరాబాదులో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. 20 రోజుల క్రితం మలుగుడుపాడు వచ్చి ఇంటి దగ్గరనే ఉన్నాడు. ఈ నెల 9న శుక్రవారం సాయంత్రం బైక్ తీసుకొని బద్వేల్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో ఉన్న తల్లికి చెప్పి పోయాడు. తిరిగి వస్తూ నందిపల్లెదగ్గర ఉన్న పెట్రోల్ బంక్‌లో రాత్రి 7.30కి పెట్రోల్ పట్టించుకొన్నట్లు అక్కడి సీసీ కెమెరా పుటేజీల్లో ఉంది. రాత్రి 7.50 సమయంలో రామ్మోహన్‌రెడ్డి వెంట రెండు బైక్‌లలో నలుగురు వ్యక్తులు వెంబడించినట్లు తెలుస్తోందని ఎస్ఐ తెలుపుతున్నాడు. పిచ్చిరెడ్డి మాత్రం గ్రామంలో తమకు ఇతరులకు కొన్ని సమస్యలు నడుస్తున్నాయని, వారే ఏదో చేసి ఉంటారని అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దేశాభివృద్ధి సైన్స్‌తోనే సాధ్యం


విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

- ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి
- డైట్ కేంద్రంలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల ప్రదర్శన

రాయచోటి టౌన్ : సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ఉప విద్యాశాఖాధికారి శ్రీ రాం పురుషోత్తం అన్నారు. సోమవారం రాయచోటి డైట్ కేంద్రంలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి ఇన్‌స్పైర్‌లు విద్యార్థులలోని శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతుందని చెప్పారు. దాగి ఉన్న సృజనాత్మకత శక్తి వెలుగులోకి వస్తుందన్నారు. చదువు అంటే మార్కులు కాదని, ప్రశ్నించే తత్వం కలిగి ఉండాలని, పరిశీలనాత్మకత కలిగి ఉండే విధంగా తీర్చి దిద్దాలన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, సర్ సీవీ రామన్, కల్పానా చావ్లా, సునితా విలియమ్స్ వంటి మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, డైట్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్‌బాబుతో కలిసి జ్యోతి వెలిగించారు. అనంతరం మొత్తం 245 ప్రాజెక్టులు ప్రదర్శనకు రాగా వాటిని అధికారులతో కలిసి పరిశీలించారు.

భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దండి

భావిభారత శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. డైట్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్‌లో విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. విద్యార్థులలోని జిజ్ఞాసన చూసిన తరువాత ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు సైన్స్‌పై మక్కువ పెంచాలని అప్పుడే భారతదేశం గర్వపడే శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కాట్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరాజు, ఎంఈవో బాలాజీ నాయక్, ఏఎంఓ రామకృష్ణ, జీసీడీవో రాధ, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా అసిస్టెంట్ సైన్స్ ఆఫీసర్ రామచంద్ర, అప్కాస్ జిల్లా కో ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, అప్కాస్ అకడమిక్ కో ఆర్డినేటర్ రవిశంకర్ రెడ్డి, వీఆర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 21 ప్రాజెక్టుల ఎంపిక

ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల ప్రదర్శనలో విజేతలు వీరే


రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైన విజేతలు వీరే

రాయచోటి : అన్నమయ్య జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో జరిగే ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల ప్రదర్శనకు 21 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. జిల్లాలోని 30 మండలాల నుంచి 245 ప్రాజెక్టులు జిల్లా స్థాయి రాయచోటిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల ప్రదర్శనకు ఉంచారు. ఢిల్లీలోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి వచ్చిన ప్రతినిధులు స్వరాజ్, ఫరీదా, శుభ్రత్ కుమార్ బారిక్‌లు ప్రాజెక్టులను పరిశీలించారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల ప్రదర్శనకు 21 ప్రాజెక్టులను జిల్లా నుంచి ఎంపిక చేశారు. ఆ ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులు, వారి పాఠశాల వివరాలు ఇలా ఉన్నాయి. తంబళ్లపల్లి మండలం బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి కె.రాజశేఖర్ నాయక్, కన్నెమడుగు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి వై.కార్తీక, అదే పాఠశాల నుంచి ఏ సుమంత్ అనే విద్యార్థి, కలకడ మండలం ఎర్రయ్యగారిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎస్ రుక్సానా, కలికిరి సైనిక్ స్కూల్ విద్యార్థి వై.ఎస్ నేహత్ కృష్ణ, మదనపల్లె మండలం జ్ఞానోదయ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థి సప్తగిరీశ్వర్‌రెడ్డి, నోబెల్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థినీ పి గౌషియా, పీపుల్ ట్రీ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థి ఆర్ఎస్ జోహార ఆనుమ్, కురబలకోట మండలం తెట్టు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి భరత్ కుమార్, పీటీఎం మండలం ఉర్దూ హైస్కూల్ విద్యార్థినీ షఫియా, పెద్దమండ్యం మండలం సిద్దవరకం కేజీబీవీ విద్యార్థినీ నాగేశ్వరీ, పీలేరు మండలం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినీ హిమవర్ష, కోటపల్లి బాలికల హైస్కూల్ విద్యార్థిని లిఖిత, కోడూరు మండలం ఆర్ రాచపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని బిందు, లక్కిరెడ్డిపల్లి మండలం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి తరుణ్ కుమార్, ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి విష్ణువర్ధన్, రాజంపేట మండలం శ్రీ సాయి విద్యాలయ హైస్కూల్ విద్యార్థి వెంకటసాయి రోహిత్, గుండ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎంఎస్ గాయత్రి, రాయచోటి మండలం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థిని ఇందు దుర్గా, సంబేపల్లె మండలం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని పి.అంజలిలు ఉన్నారు. వీరందరూ ఈనెలలో చిత్తూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టు ప్రదర్శనలో పాల్గొనున్నారు.

సైబర్ నేరాలు అరికట్టే టెక్నాలజీపై అవగాహన


ఏఐటీఎస్‌లో ఎస్పీ కృష్ణారావును సత్కరిస్తున్న చొప్పా సోదరులు

రాజంపేట : సైబర్ నేరాల అదుపు కోసం టెక్నాలజీపై పోలీసు అధికారులు పట్టు సాధించాలని జిల్లా ఎస్పీ బీ.కృష్ణారావు వెల్లడించారు. రాజంపేట ఏఐటీఎస్‌లో మినిస్టర్ ఫర్‌హోం అఫైర్స్(న్యూఢిల్లీ) ఆధ్వర్యంలో సోషల్ మీడియా-సైబర్ క్రైం-సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్‌పై నిర్వహించిన టెక్నికల్ సెమినార్‌లో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు రోజురోజుకు అధికమవుతున్నాయన్నారు. ఏటీఎం, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం తదితరాల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణులు సోషల్‌మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్‌నేరగాళ్లు ఇప్పుడు పల్లెవాసులను టార్గెట్ చేసుకుంటున్నారన్నారు. డౌన్‌లోడ్, షేర్ లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. వీటిపై అవగాహన ఉంటేనే ముందుకెళ్లాలన్నారు. ఫేక్ మెయిల్ ఐడీలతో చాలా మందిని మోసం చేస్తున్నారన్నారు. ఫోన్లతో సీసీ కెమెరాలు హ్యాకింగ్ చేస్తున్నారన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ ఎంజీఐ, యుఎస్ఏ డాక్టర్ ఉదయ శంకర్‌పురానిక్ మాట్లాడుతూ సైబర్ నేరాలను అరికట్టేందుకు అందుబాటులోకి వచ్చిన యాప్స్‌పై అవగాహన కల్పించుకోవాలన్నారు. సైబర్ నేరాల వల్ల ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నారన్నారు. ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ సైబర్ టెక్నాలజీపై విద్యార్థులలో స్కిల్స్ పెంచేందుకు సెమినార్‌లు తరుచుగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ, రాజంపేట డీఎస్పీ చైతన్య, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, డీన్ సుబ్బారావు, ఈసీఈ హెచ్‌వోడీ సీహెచ్ నాగరాజు, కో-ఆర్డినేటర్ కాశిగారి ప్రసాద్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, డీన్స్, అధికారులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని సన్మానించిన చొప్పా సోదరులు

జిల్లా ఎస్పీ కృష్ణారావు ఏఐటీఎస్‌కు వచ్చిన సందర్భంగా ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డిలు ఘనంగా సన్మానించారు. పోలీసుశాఖకు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ఏఐటీఎస్ యాజమాన్యం ముందుంజలో ఉంటుందన్నారు. కాగా విద్యార్థులకు ఐఐటీ బాంబేకి చెందిన డాక్టర్ వివేకానంద్ సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు.

టికెట్ మన నాయకునికే..

పేల్చండి బాణసంచాలు

- మండిపల్లి అభిమానులు
- టికెట్ ఎవరికీ కేటాయించలేదు : రమేష్‌కుమార్‌రెడ్డి
- టీడీపీలో బయటపడ్డ అంతర్గత విభేదాలు

రాయచోటి : రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ టికెట్ మన నాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కేటాయించారంటూ బాణసంచాలు పేల్చాలని ఆ పార్టీ క్యాడర్ ఆనందోత్సాహాల మధ్య హడావుడి సృష్టించింది. ఇదే సమయంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి స్వయంగా టీడీపీ గ్రూపులో 'టికెట్ కేటాయింపు ఇంకా జరగలేదు.. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు' అంటూ ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ల ద్వారా నేరుగా సందేశాన్ని ఇచ్చారు. దీంతో రాయచోటి నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు మరోమారు బట్టబయలు అయ్యాయి. అయితే పార్టీ అధిష్టానం నుంచి టికెట్ నీకేనని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి సమాచారం వచ్చిందని, ఆయన వర్గీయులు సంతోషాల మధ్య రోడ్లెక్కారు. ముఖ్యంగా ఆయన సొంత మండలమైన చిన్నమండెం, సంబేపల్లె, గాలివీడు ప్రాంతాలలో కొందరు బాణసంచాలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. రాయచోటిలోని మండిపల్లి భవన్ ఎదుట కూడా బాణసంచాలు పేల్చారు. వీటి పరిస్థితి ఇలా ఉంటే.. టీడీపీ టికెట్‌ను ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఆదివారం రాయచోటిలో తనకే టికెట్ లభిస్తుందన్న ఆశతో పార్టీ కార్యాలయాన్ని భారీగా ప్రారంభించారు. మంగళవారం కూడా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలందరికీ భారీ స్థాయిలో విందు భోజనాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ తరుణంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి టికెట్ కేటాయించారంటూ ఆయన అభిమానులు చేసిన కోలాహలంపై.. పార్టీలోని ఆర్ఆర్ వర్గం, సుగవాసి వర్గం, గడికోట ద్వారకనాథరెడ్డి వర్గాలు తీవ్ర స్థాయిలో స్పందించాయి. ఇలాంటి ప్రచారాల కారణంగా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారంటూ వారి అనుచరుల వద్ద, ఫేస్‌బుక్‌ల ద్వారా స్పందించడం గమనార్హం.

తెలుగు మహిళకు అవమానం

టీడీపీ స్టేట్ సెక్రటరీ పర్వీన్‌తాజ్ ఆవేదన



మదనపల్లె : 'ఇదెక్కడి దరిద్రం పని.. నేను ఒక ఆడమనిషినన్నా.. కష్టపడుకుంటూ పైకి వచ్చిన మనిషిని. నన్ను తొక్కేసి పైకి రావాలన్న ఆలోచన ఏందన్నా.. ఇది...' అంటూ టీడీపీ స్టేట్ సెక్రటరీ పర్వీన్‌తాజ్ ఆవేదనతో రగిలిపోయారు. సోమవారం సబ్‌కలెక్టరేట్ వద్ద జరుగుతున్న అఖిల పక్షం ధర్నాలో పాల్గొనేందుకు వచ్చిన పర్వీన్‌తాజ్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, జైభీమ్ నాయకులతో కలసి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆయా పార్టీల ముఖ్యనాయకులు అందరూ నిరసనకు సంబంధించి ఎలక్ట్రానిక్ మీడియాకు వాయిస్ ఇస్తుండగా, తన వంతు వస్తుందని పర్వీన్‌తాజ్ ఎదురుచూస్తున్నారు. విలేకరులు ఆమె వద్దకు మైకులు తీసుకెళ్లేలోపు.. టీడీపీకి చెందిన రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ ఆమెకు అవకాశం ఇవ్వకుండా అడ్డుతగిలాడు. టీడీపీ తరపున తానేనంటూ వాయిస్ ఇవ్వడం ప్రారంభించాడు. దీన్ని చిన్నతనంగా భావించిన పర్వీన్‌తాజ్... నిరసన నుంచి బయటకు వచ్చి... 'టీడీపీలో స్టేట్ సెక్రటరీ హోదాలో ఉన్నాను. గతంలో జెడ్పీటీసీగా పని చేసి ఉన్నాను. 24 ఏళ్ల వయస్సులో రాజకీయాల్లోకి వచ్చి, పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశాను. కుటుంబ జీవితానికి దూరంగా ఉండటంతో పాటు, భర్తను కోల్పోయి, ఒంటరిమహిళగా కష్టపడుతూ.. పార్టీ కోసం శ్రమపడుతుంటే.. నన్ను అవమానపరుస్తారా..! నిన్న మొన్న వచ్చిన నీకే అంత ఉంటే.. నాకెంత ఉండాలి' అంటూ కళ్లనిండా నీళ్లు పెట్టుకున్నారు. మహిళలను గౌరవించే తీరు ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణి దుర్మరణం


మృతి చెందిన హరిప్రియ

పీలేరు రూరల్ : రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణి మృతి చెందడంతో మండలంలోని ఒంటిల్లులో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా వున్నాయి. మండలంలోని కావలిపల్లె పంచాయతీ ఒంటిల్లుకు చెందిన టి.గణేష్‌కు ఏడాది కిందట చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం కె.ఎస్.కురవపల్లెకు దుర్గం రవీంద్ర కుమార్తె హరిప్రియ (25)తో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భిణి. బుధవారం హరిప్రియ సోదరుడి వివాహం ఉండడంతో రొంపిచెర్ల మండలం కె.ఎస్. కురవపల్లెకు వెళ్లారు. సోమవారం సొంతపనిపై భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై పీలేరుకు బయలుదేరారు. మార్గం మధ్యలో పెద్దగొట్టిగల్లు సమీపంలో జీపు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో హరిప్రియ అక్కడికక్కడే మృతి చెందింది. భర్త స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిండు గర్భిణి ప్రమాదంలో మృతి చెందడంతో పెద్ద ఎత్తున బంధువులు, గ్రామస్తులు ఆస్పత్రి వద్దకు చేరుకుని బోరున విలపించారు.

మదనపల్లెలో వరుస చోరీలు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణ నడిబొడ్డున వరుస చోరీలు జరిగాయి. సుమారు రూ.3.30 లక్షల నగదు అపహరించుకుని వెళ్లిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు... పట్టణంలోని బెంగుళూరు బస్టాండులో అన్వర్ బాషాకు చెందిన ఆఫియా అంజూమ్ స్వీట్స్ దుకాణం, రామచంద్రకు చెందిన ఉదయ్‌ట్రేడర్స్, లక్ష్మి నరసింహా ఏజెన్సీస్ దుకాణాల్లో రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి షటర్లు తొలగించి దుకాణాల్లో ఉంచిన డబ్బు అపహరించుకుని వెళ్లారు. ఆఫియా అంజుమ్ దుకాణంలో రూ.10 వేలు, సీసీ కెమెరాకు సంబంధించిన డీవీఆర్‌ను ఎత్తు కెళ్లారు. ఉదయ్ ట్రేడర్స్‌లో ఉంచిన రూ.70 వేలు నగదు, లక్ష్మి నరసింహా ఏజెన్సీస్‌లో ఉంచిన రూ.2.50 లక్షల నగదును దుండగులు ఎత్తు కెళ్లారు. సోమవారం ఉదయం దుకాణాలు తెరిచేందుకదు వచ్చిన దుకాణాదారులు తమ దుకాణాల్లో చోరీ జరిగినట్లు గుర్తించి వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ సీఐ వల్లిబసు, ఎస్ఐ హరిహరప్రసాద్‌తోపాటు క్లూస్‌టీం బృందం తనిఖీలు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

అక్రమ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న యువకులు


జేసీబీతో అడ్డుకున్న గ్రామస్తులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం రాఘవరాజపురం పంచాయతీ పరిధిలోని ముస్టేరు వద్ద కొందరు అక్రమంగా శ్మశానానికి వెళ్లే దారిని విస్తరించి ఆక్రమణకు పాల్పడుతుండటంతో.. సోమవారం రాఘవరాజుపురానికి చెందిన యువకులు జేసీబీతో రోడ్డుమార్గాన్ని తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కేవలం శ్మశాన వాటికకు మాత్రమే ఈ దారి ఉందని, కొందరు ఏరు, స్మశాన స్థలాన్ని పూడ్చి రోడ్డును విస్తరించుకోవడం తగదన్నారు. దీనిపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వారు పేర్కొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి


కడప రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్ ఆదేశించారు. ఇటీవల గుంతకల్లు డీఆర్ఎంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం కడప రైల్వేస్టేషన్‌ను, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమృత్‌భారత్ స్టేషన్ ప్రాజెక్టులో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించామని తెలిపారు. కడప రైల్వేస్టేషన్‌లో నూతన భవనాల నిర్మాణాలకు సంబంధించి వాటి వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఎంఓ శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ వైపీ సింగ్, సీనియర్ డీఈఈ గంగరాజు, ఇన్‌చార్జి రైల్వేస్టేషన్ మేనేజర్ రాజీవ్‌సింహా, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషు, ఏడీఈఎన్ రాధాకృష్ణ, ఏడీ ఎస్‌టీఈ కాత్యాకుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంతుచిక్కని వ్యాధితో ఆవులు మృతి

- వారం రోజుల్లో ఆరు మృత్యువాత
- రూ.6 లక్షలకు పైగా నష్టం
- పరిశీలించిన అధికారుల బృందం


మృతి చెందిన పాడి ఆవు


చెరువు ముందరపల్లెలో పశువులను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ వైద్య బృందం

నిమ్మనపల్లె : అంతు చిక్కని వ్యాధితో వారం రోజుల వ్యవధిలో నాలుగు చూడి ఆవులు, రెండు పెయ్యదూడలు మృతి చెందాయి. సుమారు 6 లక్షల రూపాయల మేర పాడి రైతులకు నష్టం వాటిల్లింది. నిమ్మనపల్లె మండలం అగ్రహారం పంచాయతీ చెరువు ముందరపల్లె (నల్లగొండ) గ్రామానికి చెందిన ఐదుగురు రైతులకు చెందిన పాడి ఆవులు వారం రోజులుగా మృతి చెందుతున్నాయి. దాదాపు గత 20 రోజులుగా గ్రామంలోని పాడి ఆవులకు అంతుచిక్కని వ్యాధి సోకింది. వ్యాధి సోకిన పాడి ఆవులు ఆహారం తినకుండా మానేయడం, కాలి గిట్టల వాపులతో నడవలేని స్థితికి చేరుకొని ఉన్నచోటునే కూలిపోతున్నాయి. అదే స్థితిలో రెండు మూడు రోజులపాటు ఉంటూ, సరిగా మేతమేయకుండా, పేడ వేయకుండా జీర్ణకోశ సమస్యలతో మృతి చెందుతున్నాయి. వారం రోజుల క్రితం స్థానికుడైన వై శ్రీనివాసులురెడ్డి పాడి ఆవు ఇదే లక్షణాలతో చనిపోయింది. అదే విధంగా జి.రవీంద్రారెడ్డికి చెందిన రెండు పాడి ఆవులు(దాదాపుగా 2 లక్షల రూపాయలు విలువ గలవి), జి.రెడ్డప్పరెడ్డి, జి.చిన్నరెడ్డెప్పరెడ్డి, జి.నారాయణరెడ్డిలకు చెందిన పాడి ఆవులు, పెయ్యి దూడలు మృత్యువాత పడ్డాయి. 20 రోజుల క్రితమే పశువులలో ఈ లక్షణాలు మొదలై అనారోగ్యానికి గురి అయ్యాయి. అయితే పశుసంవర్ధక శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, క్షేత్రస్థాయి పశుసంవర్ధక శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కుటుంబాలకు ఆసరాగా ఉన్న పాడి ఆవులు మృత్యువాత పడి రైతులకు తీరని నష్టం కలిగింది. పాడి ఆవులన్నీ 9వ నెల గర్భంతో ఉంటూ ఉన్నఫలంగా మృతి చెందడంతో రైతులు తీరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడి ఆవులు మృతి చెందిన అనంతరం పశుసంవర్ధక శాఖ అధికారులు మేల్కొన్నారు. హడావిడిగా మూడు రోజుల క్రితం గ్రామానికి వెళ్లారు. ఆవుల మృతికి సంబంధించిన వివరాలు సేకరించారు. సోమవారానికి మృత్యువాత పడిన పాడి ఆవుల సంఖ్య పెరగడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పశువుల మృతికి కారణాలను విశ్లేషించేందుకు మదనపల్లె వెటర్నరీ ఏడీ రోహిణి, రిటైర్డ్ వెటర్నరీ ఏడీ హసన్, మదనపల్లె వెటర్నరీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, పేథాలజిస్ట్ విష్ణు, ల్యాబ్ టెక్నీషియన్ శివ లతో కూడిన వైద్యబృందం సోమవారం గ్రామానికి చేరుకుని మృతి చెందిన పాడి ఆవుకు పోస్టుమార్టం నిర్వహించారు. స్థానిక పాడి రైతులు ఉపయోగిస్తున్న ఎండు గడ్డి, దాణా, శాంపిల్స్ తీసుకుని మదనపల్లి పశుసంవర్ధక శాఖ న్యూట్రిషన్ ల్యాబ్‌కు పంపారు. పోస్టుమార్టం నిర్వహించిన ఆవు నుంచి సేకరించిన లంగ్స్, లివర్, ప్లీన్, తదితర శరీర భాగాలను వ్యాధి నిర్ధారణకై తిరుపతి ల్యాబ్‌కు తరలించారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పాడి ఆవుల మృతికి జీర్ణకోశ సమస్యలే కారణమై ఉండవచ్చునని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే వ్యాధికి గల కచ్చితమైన కారణాలు ఇప్పటి వరకు గుర్తించలేకపోయామన్నారు. మొదటి పాడి ఆవు మృతి చెందినప్పుడే రైతు పోస్టుమార్టంకు ఒప్పుకొని ఉంటే వ్యాధి బహిర్గతమయ్యే అవకాశం ఉండేది అన్నారు. అయితే ఆవును పోస్టుమార్టం నిర్వహించడం వల్ల బయటకు వచ్చే క్రిముల కారణంగా గ్రామంలో ఇతర వ్యాధులు ప్రబలతాయేమోనన్న అనుమానంతో పోస్టుమార్టంకు రైతులు నిరాకరించినట్లు చెబుతున్నారు. అయితే గ్రామంలోని రైతులు పశువుల మేతకై ఉపయోగిస్తున్న ఎండు గడ్డిలోని తేమ వల్ల ఫంగస్ ఏర్పడే అవకాశం ఉందని, అదే విధంగా రైతులు ఉపయోగిస్తున్న ప్రైవేటు డైరీ యాజమాన్యాలు అందజేసిన వల్లభ, నంది రకాల పశు దాణాపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. అందుకే ముగ్గురు పాడి రైతుల నుంచి శాంపిల్స్ సేకరించామన్నారు. ల్యాబ్ పరీక్షల అనంతరం వ్యాధి నిర్ధారణ అయ్యే అవకాశం ఉందన్నారు. రైతులకు అవగాహన కల్పించేందుకు బుధవారం గ్రామంలో ప్రత్యేక పశుసంవర్ధక శాఖ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.